# బతుకమ్మ

## తెలంగాణా సంపూర్ణ జీవనచిత్రం




పరిశోధన - రచన:

**డా॥ మామిడి హరికృష్ణ**



**భాషా సాంస్కృతిక శాఖ**
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్

**దేవాదాయ, ధర్మాదాయ శాఖ**
తిలక్‌రోడ్, హైదరాబాద్

# బతుకమ్మ

## తెలంగాణా సంపూర్ణ జీవనచిత్రం



© భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం

పరిశోధన-రచన: డా॥ మామిడి హరికృష్ణ
ఛాయాచిత్రాలు: శ్రీ
ప్రథమ ముద్రణ: సెప్టెంబర్, 2025
ప్రతులు: 1000
వెల: రూ. 150/-

© Department of Language & Culture
Government of Telangana

Research & Written by: Dr. Mamidi Harikrishna
Photography: ???
First Edition: September, 2025
Copies: 1000
Price: Rs. 150/-

ISBN: 978-00

**Published By:**

**Dr. Mamidi Harikrishna**
**Director,** Department of Language & Culture
Kala Bhavan, Ravindra Bharathi, Hyderabad - 5000 004.
Phone : 040-29703142.

**S. Venkata Rao,** IAS
**Commissioner,**
Department of Endowments
Thilak Road, Hyderabad

**Book Sale's Available at:** All leading book shops in the country
Sales Counter at Ravindra Bharathi Complex, Hyderabad.
Ph: 040-29703142.

Cover page painting: **????????,** Back cover painting: ???????

Printed at: **Sai Likhita Printers**
Khairatabad, Hyderabad, Ph: 72070 45979

All rights reserved. No part of this book may be reproduced or utilized
in any form or by any means without prior permission
in writing from Department of Language & Culture

# బతుకమ్మ

తెలంగాణా సంపూర్ణ జీవన చిత్రం

*Every Country or nation has its own distinct culture. And the culture can be showcased, exhibited, identified, manifested, interpreted and highlighted by one collective action, i.e., festival. A festival is an outcome of the overall needs, experiences, experiments and wishes of a community/society living in a specified area, and continues for generations. In this process, any festival will develop few rituals, traditions, practices specialized for itself by which that festival got unique significance among other festivals.*

పై మాటలకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచే పండుగ – బతుకమ్మ!

బతుకమ్మ ఒక పూల పండుగ! చెరువుల పండుగ,

ఇది మహిళల పండుగ! పర్యావరణ పండుగ... ఇంకా లోతుగా వెళ్లి చూస్తే ఇది ప్రకృతికి ఒక కృతజ్ఞతలు తెలిపే పండుగ!

జీవితాన్ని ఇచ్చిన ఆడబిడ్డలకు, అమ్మలకు మనం చెప్పే ధన్యవాదాల పండుగ! మొత్తంగా సకల చరాచర సృష్టికి మానవాళి అందించే ఒక "థాంక్స్ గివింగ్" పండుగ బతుకమ్మ!

బతుకమ్మ –

**తెలంగాణ మహిళా శక్తికి నిలువెత్తు ప్రతీక!**
**తెలంగాణ ప్రజల అస్తిత్వ పతాక!**
**తెలంగాణ ఆత్మగౌరవ జీవిక!**
**తెలంగాణ జన జీవన వేదిక!**
**తెలంగాణ సాంస్కృతిక గీతిక!**



ప్రతి జాతికీ తనదైన జీవన విలువలు, తనవైన అనుభవాలు, తనవైన సామాజిక, భౌతిక, జైవిక పరమైన నేపథ్యాల నుంచి వచ్చిన ఆచారాలు, సంప్రదాయాలు, రీతులు, రివాజులు, ఉండడం సహజం. భౌగోళికంగా దక్కన్ పీఠభూమి లో తెలంగాణ విస్తరించిన పరిస్థితుల దృష్ట్యా ఇక్కడ ఒక ప్రత్యేకమైన జీవనశైలి, ఉత్సవాలు, వేడుకలు, పండుగలు, పబ్బాలు ఏర్పడ్డాయనేది తెలుస్తోంది.

"Festivals may emerge either from evolution or from revolution. No festivals on the earth has come into existence overnight. The origin, establishment, continuation and practice of any festivals can take place in due course of time for following them for many years. As such it is an evolutionary process in coherence with the natural seasons and nature laws, approved, followed and performed by large masses as a tradition". అన్న మాటలకు బతుకమ్మ పండుగ చరిత్ర, వేల సంవత్సరాల నుండి కొనసాగిన దాని ప్రస్థానం అచ్చమైన దృష్టాంతంగా కనిపిస్తుంది.

సామాజిక శాస్త్రవేత్తలు (Sociologists), మానవ అధ్యయన శాస్త్రవేత్తల (Anthropologists) అంచనాల ప్రకారం, చరిత్రకారుల నిర్ధారణల ప్రకారం సాధారణంగా పండుగలు ప్రకృతిలో ఉండే ఆరు ఋతువులు ఆయా ఋతువుల విశేషాలను, విశిష్ట లక్షణాలను, శీతోష్ణస్థితి పరిస్థితులను, ప్రాకృతిక, పర్యావరణ పరమైన మార్పులను, వాతావరణ పరమైన అంశాలను అన్నింటిని మేళవించి వాటికి అనుకూలంగా, పండుగలు రూపొందుతాయని చెప్పవచ్చు. అలా బతుకమ్మ పండుగ ఒక అత్యంత అద్భుతమైన జీవనోత్సాహపు పండుగ! తెలంగాణా ప్రజలందరూ సామూహికంగా చేసుకునే ఒక వేడుక బతుకమ్మ పండుగ!

## సామూహిక ఉత్సవ ప్రతీక - బతుకమ్మ

బతుకమ్మ తెలంగాణ ప్రజల జీవితంలో అంతర్భాగమై వేలాది సంవత్సరాల నుంచి ఒక ఉత్సవంగా, పండుగగా కొనసాగుతూ వస్తోంది. అయితే బతుకమ్మ పండుగగా తెలంగాణ ప్రజల జీవితంతో పెనవేసుకొని పోవడం ఒకవైపు అయితే మరొక వైపున వేలాది సంవత్సరాల సామాజిక చరిత్రకు కొనసాగింపుగా బతుకమ్మ ఉండటం విశేషం!

ప్రకృతిలో సంభవించే పరిణామాలు (Natural Developments), శీతోష్ణస్థితి కారణాలు (Climatic Conditions), ఋతువుల మార్పిడి (Seasons changes) ఇవన్నీ మానవాళికి ఉత్సవ కారకాలే! అవే క్రమంగా పండుగలుగా పరిణామం చెందాయని సామాజిక శాస్త్రవేత్తలు చెపుతారు. మనిషికి తన పరిసరాలు, ప్రకృతికి మధ్య ఉండే అవినాభావ సంబంధం, పరస్పర అనుబంధం, పరస్పర ఆధారిత మనస్తత్వం, ఇలా కాలక్రమంలో సామూహిక ఉత్సవాలుగా రూపొందడానికి కారణాలు అయ్యాయని మానవ శాస్త్రవేత్తలు (Anthropologists) నిరూపించారు. కాలాలు మారినప్పుడు, రుతువులు పరిణామం చెందినప్పుడు, ఆ పరిణామాలని మానవ జీవితానికి అన్వయిస్తూ శారీరక, మానసిక సంసిద్ధత చేసుకోవడం, తనని, తన కుటుంబాన్ని, తన గణాన్ని, తన గ్రామాన్ని రాబోయే సవాళ్లను ఎదుర్కొనేలాగా ముందస్తు చర్యలు తీసుకోవడం నేపథ్యంలోనే ఈ పండుగలు వచ్చాయని చెబుతారు. అలా తెలంగాణ జన జీవితంలో భౌగోళికంగా విస్తరించిన భూమి నేపథ్యంలో వర్షాకాలపు సమయాన కొత్త నీరు వెల్లువలా ప్రవహిస్తున్న క్షణాన ఈ బతుకమ్మ పండుగ నిర్వహించడం జరుగుతుంది.

బతుకమ్మ పండుగ సాధారణంగా భారతీయ కాలమానం ప్రకారం ఆశ్వీయుజ మాసం లో వస్తుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకకి తెలంగాణ మహిళలు ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజంగా, ఉల్లాసంగా, ఉద్వేగభరితంగా పాల్గొంటారు. వేలాది సంవత్సరాల సాంస్కృతిక వైభవం, గొప్ప పరంపర ఈ బతుకమ్మ పండుగ.

బతుకమ్మ అనే పదం ఉత్పత్తి, భాషా విశేషాలను గమనిస్తే "బతుకు" + "అమ్మ" బతుకమ్మగా మారిందని సులభంగా అర్థమవుతుంది. బతుకును ఇచ్చేది అమ్మ! అంటే ఈ లోకానికి జీవిని అందించి, బతుకును



సృష్టించగలిగే శక్తి అమ్మకు మాత్రమే ఉంది, స్త్రీకి మాత్రమే ఉంది. మహిళలో ఉండే ఒక విశిష్ట లక్షణం జన్మనివ్వడం అనే అంశాన్ని ఉదాత్తీరణం చెందే ప్రక్రియగా ఒకవైపున భావిస్తే, మరొక వైపున అమ్మతనాన్ని, అమ్మ తత్వాన్ని, అమ్మలో ఉండే త్యాగనిరతిని, అన్నింటినీ మేళవించిన ఒక జీవన సంస్కృతి బతుకమ్మలో మనకు అంతర్లీనంగా కనిపిస్తుంది.

"నడిచే బతుకమ్మలు"గా మనకు ఆడబిడ్డలు, మహిళలు, స్త్రీలు, అమ్మలు కనిపించినప్పటికీ, బతుకమ్మ మన ప్రాకృతిక సంస్కృతి. అందుకే ఆ ప్రకృతికి నీరాజనంగా, ఆ ప్రకృతి మాతకు నివేదనగా, ఆ ప్రకృతి దేవతకు అర్చనగా పూలతో చేసే పండుగ బతుకమ్మ పండుగ!

సాధారణంగా భారతీయ సంప్రదాయంలో, హైందవ భారతీయ పూజా విధానంలో దేవుడికి లేదా దేవతకి పూలతో అర్చించే సంప్రదాయం ఉంది, కానీ ప్రధాన స్థానంలో పూలనే పెట్టి, పూలనే దేవతగా భావించి, దైవత్వానికి ప్రతినిధిగా గుర్తించి, పూలనే అర్చించే ఒక గొప్ప పండుగ బతుకమ్మ పండుగ!

బతుకమ్మ పండుగ ప్రారంభం నుంచి మొదలుకొని, దాని నిమజ్జనం వరకు జరిగే వేడుకలలో గొప్ప జీవన విలువలు మనకు సాక్షాత్కరిస్తాయి. బతుకమ్మ పండుగ, కుటుంబ విలువలను, వారసత్వ సంపదను, ఒక పరంపరని కొనసాగించే ఒక ప్రక్రియగా భావించవచ్చు. తెలంగాణ జాతి అస్తిత్వ ప్రతీకగా, ఆత్మగౌరవ పతాకగా, మనదైన తత్వాన్నీ 'ఇదీ తెలంగాణ జాతి' అని ప్రపంచానికి చాటి చెప్పగలిగిన అంశంగా కూడా బతుకమ్మను గమనించవచ్చు. ఇంకొకవైపు తెలంగాణ ప్రజల జీవన సంస్కృతిని, జీవిత ధర్మాలను, ఇతర ప్రాంతాల ప్రజల నుంచి భిన్నంగా చూపించడానికి, విశిష్టతను చెప్పడానికి, వైవిధ్యం చూపించడానికి, బతుకమ్మ పండుగ ఒక ప్రత్యేక ప్రతీకగా నిలుస్తుందని చెప్పవచ్చు.

## 8 రోజుల పండుగ:

బతుకమ్మ పండుగ ఎనిమిది రోజుల పాటు జరిగే పండుగ, మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండవరోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగవ రోజు నానబియ్యం బతుకమ్మ, అయిదవరోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజువేపకాయల బతుకమ్మ, ఎనిమిదివ రోజు వెన్నముద్దల బతుకమ్మతో కొనసాగి చివరికి తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా పరాకాష్టకు





చేరుకొని బతుకమ్మ పండుగ తాలూకు ఒక సంపూర్ణతని మనకు సాక్షాత్కరింప చేస్తోంది.

ఎనిమిది రోజులపాటు జరిగే ఈ పండుగలో ప్రతి రోజుకి ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి రోజుకి ఒక విశిష్టత ఉంది. సద్దుల బతుకమ్మ ఎనిమిదవ రోజు దుర్గాష్టమి రోజు జరిగే విశిష్టతగా, సద్దుల బతుకమ్మ రోజు అందరు గ్రామం నుంచి మొదలుకొని, పల్లెపల్లెనా, వాడవాడలా, వీధివీధిన మహిళలందరూ అందంగా అలంకరించుకొని, స్నానాలు చేసి, పూజలు చేసి, బతుకమ్మలను పేర్చి, ఆ బతుకమ్మని చేతుల్లో పట్టుకొని వారి వారి ఇళ్ల నుంచి దగ్గర్లోని చెరువుకు వెళ్లి ఆ చెరువు గట్టు మీద ఆటలు పాటలతో పాటు, ఇంట్లో తయారుచేసి వెంట తెచ్చుకున్న సద్దులను కూడా పంచుకుంటారు. అందరూ చివరికి బతుకమ్మలను నీళ్ళల్లో, చెరువులో నిమజ్జనం చేయడం అనేది సంప్రదాయం.

ఈ మొత్తం విధానంలో గొప్ప లక్షణాలు మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా ఉపయోగించే పూలు అన్నీ కొండల్లో, కోనల్లో, చెరువుల్లో, కట్టల పొంటి పెరిగే పూలు కావడం విశేషం. తంగేడు పూలు, గునుగు పూలు, గుమ్మడి పూలు, అలాగే సీతజడపువ్వు, ఇలా రకరకాల సీజనల్ పువ్వులతో పాటు, పసుపుతో చేసే గౌరమ్మ ఇక్కడ విశిష్టత.

## 'బతుకమ్మ పేర్చుట - కళాత్మకత

బతుకమ్మ పేర్చడంలో ఒక చక్కని "కళాత్మకత" (Artistic) గోచరిస్తుంది. తీరొక్క పూలను క్రమ పద్ధతిలో, వరుసక్రమంలో ఒక్క తీరు పూవులన్నీ ఒకే వరుసలో ఉండేలా









పేర్చడం, గునుగు పూలకు కావలసిన రంగులు వేసి వాటిని అందంగా తీర్చిదిద్దడం అంత ఒక "సృజనాత్మక వ్యవస్థీకృత, సౌందర్య విన్యాసం" (A Creative, Organised and aesthetic arrangement) అని చెప్పవచ్చు.

ఇలా బతుకమ్మ నిర్మాణం, ఏర్పాటు చేసే విధానం కూడా భారతీయ తాత్వికచింతనకి ప్రతీకగా (A symbol of Indian Philosophical thought) ఉంటుంది. అధోమూలం నుండి ఊర్ధ్వగమనం దిశగా మానవ జీవన ప్రస్థానం భౌతికం నుంచి అభౌతికంవైపుగా, ఆత్మవైపుగా ప్రయాణం జరుగుతుంది అని చెప్పకనే చెప్పినట్లు అనిపిస్తుంది. తర్వాత ఆడపిల్లలు అందరూ ఆ రోజు కొత్త బట్టలు ధరించి, కొత్త చీరలు ధరించి, అందంగా అలంకరించుకుని, పెళ్లిళ్ల ద్వారా, కుటుంబ వివాహాల ద్వారా ఎక్కడెక్కడో, ఏ ఊళ్లోకి వెళ్లినా బతుకమ్మ పండుగ సమయంలో మాత్రం తమ సొంత ఊరికి, అమ్మ గారి ఇంటికి వచ్చి, అందరినీ కలిసి, అందరితో కలిసి, ఒక సామూహిక ఉత్సవంగా జరుపుకోవడం అనేది, అమ్మగారింటి పండుగగా బతుకమ్మ పండుగ నిలుస్తోంది.

## బతుకమ్మ జల శుద్ధి

దీంతో పాటు బతుకమ్మ పండుగలో పర్యావరణ ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. నిజానికి బతుకమ్మ పండుగ వర్షాకాలపు చివరిలో రావడం జరుగుతుంది. వర్షాకాలంలో వానలు కురిసి నీళ్లన్నీ చెరువులలో నిలిచి, వాగులు, వంకలు అన్నీ కొత్త నీళ్ళతో నిండిన తర్వాత, ఆ నీరు ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. బహుశా ప్రాచీన కాలంలో ఈ సంప్రదాయం ప్రారంభించడానికి ముందు కాలంలో, ఇప్పుడున్న ఆధునిక సౌకర్యాలు, పారిశుధ్య విధానాలు లేకపోవడం


సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



వల్ల గ్రామాలు, పల్లెల్లో ఉండే ప్రజలందరికీ నీటి సంబంధిత వ్యాధులు (Water Contaminated diseases) వస్తూ ఉండేవి. ఆ రోజుల్లో గృహావసరాలకు, తాగునీటికి, సాగునీటికి, అన్నిటికీ ఆధారం చెరువులే కావడం, ఆ నీటిని ఉపయోగించడం ద్వారా ప్రజల్లో ముఖ్యంగా బాలలు, బాలికలు ఈ నీటి ఆధారిత వ్యాధుల బారిన పడి మరణించి ఉంటారని ఊహించవచ్చు. దాని ప్రజల్ని రేపటి తరాన్ని కాపాడుకోవాలన్నది ఆనాటి జానపదులకు, గ్రామీణ ప్రజలకి లక్ష్యంగా మారింది.

దానికోసం చెరువులని శుద్ధిచేయడం, చెరువులని పరిశుద్ధంగా మార్చడమే కాకుండా, ఒక గ్రామంలోని ప్రజలందరూ తమ బ్రతుకులను, తమ తర్వాతి తరాల బ్రతుకులను కొనసాగించడానికి, అందరూ కలిసి ఒక ఉత్సవంగా, ఒక వేడుక లాగా చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచే ఈ సంప్రదాయం వచ్చి ఉంటుందని చెప్పవచ్చు. ప్రాకృతికమైన, సహజమైన విధానంలో చెరువులను శుద్ధి చేయాలని భావించి దానికోసం పువ్వులను ఉపయోగించాలని ఆశించారు. ఏ పువ్వులలోనైతే పుప్పొడి ఉంటుందో, ఏ పసుపులో అయితే యాంటీబయోటిక్ లక్షణాలు ఉంటాయో ఆ అంశాలను గమనించి ఈ శాస్త్రీయ జ్ఞానానికి (Scientific Knowledge)కు సంప్రదాయాన్ని (Tradition)ను జోడించి పువ్వులుగా పేర్చి, బతుకమ్మగా కూర్చి, చెరువులలో నిమజ్జనం చేయడం ద్వారా ఈ పువ్వులలోనూ, గౌరమ్మగా ప్రతిష్టించిన పసుపు ముద్దలోనూ ఉండే యాంటీబయోటిక్ లక్షణాలు నీళ్లల్లో కలిసి, ఆ నీళ్ళని మొత్తంగా పరిశుద్ధం చేస్తాయని భావించి ఉండవచ్చు. ఇది ఒక్కరోజులో కనుగొన్న విషయం కాకపోవచ్చు. ఎన్నెన్నో యత్న – దోష (Trial and Error) విధానాల తర్వాత అవగాహనకు వచ్చి ఉండవచ్చు. అంటే ఆధునిక కాలంలో సాంకేతిక విజ్ఞానం పెరిగిన తర్వాత చెరువుల పరిశుద్ధి కోసం 'క్లోరినేషన్' లాంటిది ఎలా చేస్తున్నామో, అలాంటి ప్రక్రియనే ప్రాకృతిక, సహజ విధానాల్లో ఈ పూలన్నీ పూలలోని పుప్పొడి నీళ్లలో చెరువులో వేయడం ద్వారా పరిశుద్ధం చేశారనేది చెప్పవచ్చు. దీని ద్వారా ఆ చెరువులోని నీటిని తాగిన పిల్లలు, బాలలు, మహిళలు, వృద్ధులు, అందరూ కూడా నీటి సంబంధిత వ్యాధుల బారిన పడకుండా తమని తాము రక్షించుకోగలిగే, అవకాశం ఏర్పడింది. ఇలా బతుకమ్మ పండుగకు ఒక సామాజిక ప్రయోజనం, ఒక విస్తృత సామూహిక శ్రేయోదృక్పథం (Wider collective welfare outlook) అంతర్లీనంగా ఉంది.

"The Festivals are anthropological by origin, sociological in nature, religious in practice, scientific in temperament and on the whole they are meant for the well-being of the mankind".

మరొకవైపున బతుకమ్మ పండుగ నిమజ్జనంలో ఓ అజ్ఞాత సౌందర్య శాస్త్రం (Aesthetics) కొలువైందేమో అనిపిస్తుంది. ఆకాశానికి ప్రతిబింబంగా కనిపించే చెరువు.. ఆ చెరువులో తేలియాడే బతుమ్మలు, అందమైన పూలతో ఒక ప్రత్యేక




RAVINDRA BHARATHI









కాల్పనిక దృశ్యాన్ని ప్రదర్శిస్తున్నట్టుగా కనిపిస్తాయి. ఒక సామూహిక సౌందర్య సృష్టి బతుకమ్మ నిమజ్జనంలో కనిపిస్తుంది. బతుకమ్మను పేర్చడంలో ఎంత సౌందర్యాత్మకత ఉందో, బతుకమ్మలను నిమజ్జనం చేసిన తరువాత, నీళ్ళను రంగులతో అద్దినట్లుగా కనిపించే పూలని చూసినప్పుడు కలిగే అనుభూతి కూడా అంతే గొప్పగా ఉంటుంది. రకరకాల ఆకృతులలో చెరువు అంతా పూలతో అలంకరించినట్టుగా కనిపిస్తుంది. ఇలా ప్రకృతికి ప్రతీక అయిన చెరువులను అందంగా అలంకరించే ఆడబిడ్డల ఆత్మీయ తత్వానికి నిలువెత్తు నీరాజనం బతుకమ్మ ఉత్సవం.

ఇలాంటి బతుకమ్మ అనూచానంగా వందలాది సంవత్సరాల నుంచి తెలంగాణ జన జీవన శైలిలో అంతర్భాగంగా కొనసాగుతూ, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, మహిళల ధైర్యానికి, చైతన్యానికి ప్రతీకగా కొనసాగుతూ వచ్చింది. జానపదుల పండుగ (Festival of Folks), పల్లెల పండుగ (Country Festival) గ్రామీణుల తాత్విక జీవనసరళిగా (Philosophical lifestyle of Rural Folks) మొదలైన ఈ పండుగ ఆ తర్వాత క్రమక్రమంగా పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించి, తెలంగాణ ఆత్మీయ తత్వానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది.



## మానుషేతర రూపార్చన

అయితే భారతదేశంలో దైవారాధన అంటే విగ్రహారాధనే! దైవరూపాలనే విగ్రహాలుగా చెక్కి లేదా విగ్రహాలనే దైవ రూపాలుగా భావించి పూజించే సంప్రదాయంలో పూలు కేవలం పూజా సామాగ్రి కోవలోనివే! భారతీయ ఆధ్యాత్మిక జీవన ప్రస్థానంలో దేవుళ్ళని ఆరాధించడానికి, అర్చించడానికి పూలు సాధనాలు మాత్రమే! కానీ బతుకమ్మ పండుగలో ప్రత్యేకమైన దేవుడు కానీ, విగ్రహం కానీ ఒక నిర్దిష్టమైన ఆకారం కానీ ఏది లేకుండా కేవలం పూలే ఆరాధన పీఠంపై అధిష్టించి అర్చన ని పొందగలిగి, పూజకు అర్హతను సాధించిన స్థితి లభిస్తుంది. గౌరమ్మ పేరిట తీర్చిదిద్దిన పసుపు ముద్ద శిఖరం పై నిలిస్తే పీఠం నుంచి శిఖరం వరకూ త్రికోణ ఆకృతిలో రూపొందిన నిర్మాణమంతా పూలు, పూరేకులు, ఆకులు, పూల పుప్పొడిల సమ్మిళితంగానే ఉంటుంది. అందుకే కొత్త బట్టలు, ఇంటికి రంగులు, మామిడి తోరణాలు, పిండివంటలు ఎన్ని ఉన్నా బతుకమ్మ పండుగ అంటే పూల పండుగే!

ఆ లెక్కన బతుకమ్మ ఆరాధన ఓ "మానుషేతర రూపార్చన" అని చెప్పవచ్చు. ఇలాంటి స్థితి ఆదిమ మానవుని కాలపు





గణ జీవన దశలో జరిగింది. అందుకని ఈ తరహా ఆరాధనా విధానాన్ని మానవ శాస్త్ర వేత్తలు "ఆదిమ జీవన సంస్కృతి"గా, తొలి మానవుల "సంకేత ఆరాధన" (Totemism)కు కొనసాగింపుగా వర్ణిస్తారు. అంటే మానవుడు తన జీవన యానంలో ఎంత ఆధునికంగా ఎదిగినా, తనలోని మౌలికమైన, ఆదిమ సంస్కృతులను ఇప్పటికీ నిలుపుకున్నాడనడానికి బతుకమ్మను సాక్ష్యంగా భావించవచ్చు.

అయితే బతుకమ్మ పండుగ అంటే పూల పండుగ ఒకటేనా?

కాదు మరెన్నో విశేషాలు మరెన్నో పండుగల సమాహారమే బతుకమ్మ పండుగ!



**1) పూల పండుగ - సహజ చికిత్సల పండుగ (Natural Therapy Festival):** సాధారణంగా బతుకమ్మ పండుగ అంటే అందరికీ అర్థమయ్యేది పూల పండుగ! గ్రామీణ ప్రాంతాలలో కొండల్లో, గుట్టల్లో, వాగులు, వంకల గట్టుల్లో పెరిగే చెట్లు, వాటి మీద పూసిన తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చడం, రకరకాల అటవీ పూలను ఒక్కచోట తీర్చడం, జరుగుతూ వస్తోంది. గునుగు పూలు, సీతజడ పూలు, గుమ్మడి పూలు, తంగేడు పూలు, బంతి పూలు ఇలా ఆ ఋతువులో లభించే రకరకాల పూలను ఒక చోట చేర్చి పూలనే ఇంద్రధనస్సులా నిలబెట్టడం, పూల పిరమిడ్ ని రూపొందించడం ఒక విచిత్రం!.

దీనికితోడు ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే ప్రకృతి, దానిలోని చెట్లు, అవి పండించే పూలలో నిక్షిప్తమైన చికిత్స లక్షణాలు! 'బతుకమ్మలో' పేర్చే ప్రతి పువ్వు చూడటానికి అందంగా కనిపించడమే కాక, ఆరోగ్యపరంగా, వైద్య చికిత్సల పరంగా సహజమైన గుణాలతో మనుషులు ఎదుర్కొనే ఎన్నెన్నో రోగాలను నయం చేస్తాయి. ఈ అంశాన్ని 'బతుకమ్మ'లో ఉపయోగించే పూలు వాటి సహజ చికిత్సగుణాల నేపథ్యంలో ఇలా వివరించవచ్చు:







**గునుగు పువ్వు (Celosia):** ఏంటీ బాక్టీరియల్, ఏంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి మధుమేహ నివారకంగానూ, గాయాలను పువ్వు మాన్పడంలోనూ ఉపయోగపడుతుంది. ఏంటి ఆక్సిడెంట్ లక్షణాలను కలిగిన గునుగు ఆకులను గాయాలపై పిండి కట్టుగా గాయాలను మాన్పడానికి ఉపయోగిస్తారు.

**తంగెడు పువ్వు (Tanner's Cassia%):** తంగేడు పూలను మూలికలుగానూ, నాటువైద్యంలోనూ విరివిగా ఉపయోగిస్తారు.

**బంతిపువ్వు (Marigold):** బంతిపూలు చాలా సమర్థవంతమైన ఏంటి బంతి పువ్వు సెప్టిక్‌గా పని చేస్తుంది.

**చామంతి పువ్వు (Chrysanthemum):** ఎన్నో వ్యాధులను, శారీరక రుగ్మతలను నయం చేయడంలో, నివారించడంలో ఎంతో సమర్థ





వంతమైన ఏంటి ఆక్సిడెంట్. ఈ చామంతి పూలు కాల్షియం, మాంగనీస్, ఫోలేట్, ఐరన్, సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్, మాంగనీస్, జింక్, కాపర్ వంటి అత్యవసరమైన మినరల్స్ కలిగి ఉంటాయి.

**తామర పువ్వు (Indian Lotus):** తామర పూలు లినోలిక్ ఏసిడ్, ప్రొటీన్లు, ఫాస్ఫరస్, 'ఐరన్ మరియు విటమిన్ బి మరియు సిలను కలిగి ఉంటాయి. ఆయుర్వేద వైద్యులు సాధారణంగా ఈ తామర పూలను వాటి యొక్క శీతల లక్షణాలు, ఆహ్లాదపరచే లక్షణాల ఆధారంగా ఫేషియల్‌కు వాడుతారు.

**గుమ్మడి పువ్వు (Cucurbita):** గుమ్మడి పూలు మధుమేహ నివారకంగాను, కణుతుల నివారకంగానూ, రక్తపోటు నివారకం గాను, యాంటి బాక్టీరియల్ ఏజెంట్గాను వాడుతారు.

**దోస పువ్వు (Cucumis):** దోస పూలు జీర్ణకోశ సంబంధిత వ్యాధులను నివారించడంలో ఉపయోగిస్తుంటారు.

**కట్ల పువ్వు (Ipomoea):** కట్ల పూలు క్యాన్సర్ నివారక మరియు నొప్పిని తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.

**బీర పువ్వు (Luffa):** బీర వేర్లను సంజు వ్యాధిని నివారించడానికి, పాలు పట్టడానికి వాడుతారు. అలాగే బీర ఆకులను కామెర్ల రోగ నివారణలో ఔషధంగా వాడుతారు.







**గడ్డి పువ్వు (Tridax):** వైరస్‌ను అరికట్టడానికి, గాయాలను మాన్పడానికి, బాధ నివారణకు, సూక్ష్మ జీవులను అరికట్టడానికి ఈ గడ్డిపూలు ఉపయోగపడతాయి. వీటి ఆకుల రసాన్ని తాజా గాయాలను మాన్పడానికి, రక్తస్రావాన్ని అరికట్టడానికి కొన్ని గిరిజన ప్రాంతాలలో ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది.

**వామ పువ్వు (Ajwain):** వామ సంబంధిత వ్యాధులను నివారించడంలో వామపూలు సమర్థవంతంగా పని చేస్తాయి.

అలా బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాక, పూలలో దాగి ఉన్న ఔషధ గుణాలు, చికిత్స లక్షణాల వల్ల ఇది "సహజ చికిత్సల పండగ" **(Natural Therapy)** అని కూడా చెప్పవచ్చు.

**2) చెరువుల పండుగ (Lakes Festival):** కొత్త నీరు ప్రవహిస్తూ వాగులు, వంకలు దాటి చెరువులన్నీ నిండుగా ఉండే వర్షాకాలపు మధ్యభాగంలో ఈ బతుకమ్మ పండుగ మనల్ని పలకరిస్తుంది. ఊరు, వాడలంతటా ఉన్న చెరువులన్నీ నిండుకుండలా నీళ్లతో నిండిపోయి తళుకు బెళుకులతో వెలుగుతుంటాయి. నేలపైన ప్రకృతి ఏర్పరచిన వెండి అద్దం లాగా మెరుస్తూ కనిపిస్తాయి. సూర్యుడిని, మేఘాలనీ, ఆకాశాన్ని ఆ అద్దపు ప్రతిబింబంలో మనకు దర్శనమిచ్చేలా

చేస్తాయి. వెండి పూతతో, నీలపు రంగులతో చిన్ని ప్రకంపనలకే తరంగాలు, తరంగాలుగా పరవశించే చెరువు సుందరంగా, మనోహరంగా, నయనానందకరంగా రంగురంగుల పూల పడవలతో అలంకరించుకునేది బతుకమ్మ పండుగ రోజే! ఈ చెరువులలోని నీరే ప్రజలకి, పశుపక్ష్యాదులు అందరికీ ప్రాణాధారంగా నిలుస్తుంది. ఏ ప్రాణాధారమైన నీటికి నెలవులుగా చెరువులు ఉన్నాయో ఆ చెరువులని పూజించే పండుగ బతుకమ్మ! ప్రజలంతా సామూహికంగా కలిసి చెరువులని పూల హారాలతో అలంకరించి భక్తిని ప్రదర్శించే పండుగ బతుకమ్మ పండుగ.

**3) మహిళల పండుగ (Festival of Women folk):** బతుకమ్మ పండుగ మహిళలే ప్రధాన కథానాయికలుగా, మహిళలే జరుపుకునే వేడుక. “మహిళల కొరకు, మహిళల వలన, మహిళల చేత” నిర్వహించబడే గొప్ప సాంస్కృతిక ఉత్సవం. అయితే ప్రతీ పండుగలాగే కుటుంబ సభ్యులందరూ ఉత్సవ సన్నాహాల్లో, పండుగలకు సంబంధించిన ఏర్పాట్లలో చేదోడువాదోడుగా నిలిచినప్పటికీ బతుకమ్మ పండుగలో ప్రధాన సూత్రధారులు, పాత్రధారులు మహిళలు కావడం విశేషం. కుటుంబంలో మిగతా పురుషులు అందరూ బతుకమ్మ పండుగ వేడుకలలోని, సన్నాహాల్లో క్రియాశీలంగా ఉన్నప్పటికీ, వారందరిదీ సహకార పాత్రే తప్ప సంపూర్ణ పాత్ర మాత్రం కాదు. ఇంకో







మాటలో చెప్పాలంటే బతుకమ్మ అనే సంగీత కచేరీలో మహిళలు ప్రధాన గాయనులైతే, మిగతా కుటుంబం, కుటుంబంలోని పురుషులందరిదీ కేవలం పక్క వాయిద్యాల **(Accompanying)** పాత్రే అని చెప్పొచ్చు.

అలా సాధారణంగా పురుషులు బతుకమ్మను పేర్చడానికి కావలసిన పూలను, మామిడి ఆకులను, ఇతర సామాగ్రిని తీసుకొని వచ్చినప్పటికీ దాని కోసమని అడవికి లేదా గ్రామాన్ని అనుసరించి ఉండే కొండలు గుట్టలకి వెళ్లి తంగేడు పూలను, ఏరి కోసి, తీసుకొని వచ్చినప్పటికీ దీంట్లో ప్రధాన పాత్ర మాత్రం మహిళలదిగానే ఉంటుంది. కుటుంబ పరంగా ఇలా ఉంటే, ఇక సామూహిక ఉత్సవపరంగా కూడా మహిళలు జరుపుకునే మహిళా ఉత్సవం బతుకమ్మ పండుగ!.

తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ఉండే నాలుగున్నర కోట్ల జనాభాలో రెండున్నర కోట్ల జనాభా మహిళలదే! వారిలో దాదాపు రెండు కోట్ల మంది మహిళలు వేర్వేరు ప్రాంతాలలో ఒకే రోజు అంటే సద్దుల బతుకమ్మ రోజు సాయంత్రం ఒక్క చోటికి వచ్చి బతుకమ్మ పాటలతో, బతుకమ్మ నృత్యాలతో, పూలతో పేర్చిన బతుకమ్మలను చేతుల్లో పట్టుకుని గొప్పగా దర్శనమిస్తారు. సద్దుల బతుకమ్మ రోజు హనుమకొండలోని పద్మాక్షి గుట్ట పాదాల దగ్గర కొన్ని లక్షల మంది మహిళలు



జమ చేరి వారందరూ ఈ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనే సంప్రదాయం శతాబ్దాల కాలం నుంచి కొనసాగుతూ వస్తోంది.

ఇలా తెలంగాణ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలలో చెరువులకు ఒడ్డున, నదుల ఒడ్డున, ఆయా గ్రామాలు లేదా నగరాలు లేదా పట్టణాలలోని మహిళామణులంతా బతుకమ్మ పండుగని జరుపుకుంటారు. ఈ విధంగా రెండు కోట్ల మంది మహిళలు ఒకే రోజు వేరు వేరు వేదికల మీద ఉత్సవాలు జరుపుకునే ఒకే ఒక పండుగగా ప్రపంచం లోనే అరుదైన అద్భుతంగా ఆవిష్కరిస్తోంది బతుకమ్మ పండుగ. అందుకే బతుకమ్మ మహిళల పండుగ, ఆడబిడ్డల పండుగ, అమ్మల పండుగ, అమ్మాయిల పండుగ, అమ్మమ్మల పండుగ. మొత్తంగా స్త్రీలకు పట్టాభిషేకం చేసే పండుగ.

**4) ప్రకృతి పండుగ (Festival of Nature):** అనాది కాలం నుంచి ప్రకృతి పరిసరాలు, జీవులు వీటి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఈ నేలపై జీవి సంచారం మొదలైనప్పటి నుంచి ప్రకృతికి, జీవికి మధ్య పరస్పర ఆధార జీవితం, ప్రకృతి ఒడిలో ఎదుగుదల, కొనసాగుతూ వస్తోంది. జీవి ఏకకణం నుంచి మొదలై బహుకణ జీవులుగా వివిధ రకాల జంతుజాలంగా, పశుపక్ష్యాదులుగా విస్తరించడం జరిగింది. ఆ క్రమంలోనే తెలివైన జీవిగా మానవుడు ఉద్భవించి క్రమ పరిణామంలో ఆధునిక మానవుడిగా, నవీన సాంకేతిక మానవుడుగా ఎదిగినప్పటికీ మానవుడి జన్యువులలో ప్రకృతి అనుగుణ్యమైన జీవనశైలే రికార్డయింది. ఇది ప్రకృతివాదులు **(Naturalists)** చెబుతున్న సత్యం. అందుకే మానవుడు ప్రస్తుతం ఈ వేగవంతమైన కమ్యూనికేషన్ ప్రపంచంలో ప్రకృతికి, సృష్టికి భిన్నమైన “వర్చువల్ వరల్డ్”ని సృష్టించినప్పటికీ, ఆ సృష్టిలో తాను కొనసాగుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, మానవుడిలోని జైవిక గడియారం **(Biological clock)**, సహజ జీవన కాల గమనం **(Natural Time Style)** మాత్రం ఇప్పటికీ ఎప్పటికీ ప్రకృతి అనుగుణమైన సూత్రాలకు లోబడి ఉండటమనేది గమనించదగినది. అందుకే ప్రకృతిలోని రుతువులు, కాలాలు మారినప్పుడల్లా, దానిని అనుసరించి మానవ జీవన గమనం, మానవుడి ఆహారపు అలవాట్ల విధానం, గృహ నిర్మాణ శైలి, వాహనాలు మిగతా అన్ని మారుతూ వచ్చాయి. మానవాళి జీవనశైలి అంతా ప్రకృతిని అనుసరించి నిర్ధారించడం జరిగింది. అందుకే మానవుడు జీవనశైలి విన్యాసాలు, అంటార్కిటిక్ ప్రాంతంలో, సహారా అడవి ప్రాంతంలో అమెజాన్ అడవుల్లో వేర్వేరుగా ఉంటూ పూర్తిగా ఆయా ప్రాంతాల నైసర్గిక, భౌగోళిక, శీతోష్ణస్థితి పరిస్థితులను బట్టే నిర్వహించబడుతున్నాయి. అందుకే ప్రకృతి – మానవుడు మధ్య పోరాటంలో మానవుడు ఎంత సంఘర్షించినా, మానవుడు ప్రకృతికి అతీతంగా వెళ్ళాలని ఎంత ప్రయత్నించినా, చిట్టచివరికి ప్రకృతి సూత్రాలకు లోబడే మానవుడు నిత్య జీవితం కొనసాగిస్తున్నాడు. అలా ఉన్న మానవుడే విజయం సాధిస్తున్నాడు. పర్యావరణ స్పృహతో, ప్రకృతి నియమాలకు, సహజమైన వాతావరణ సూత్రాలకి అనుగుణంగా జీవన విధానాన్ని కలిగి ఉన్న జీవులు మానవులు మాత్రమే కలకాలం నిలుస్తున్నారు అని అర్థమవుతుంది.

అందుకే బతుకమ్మ పండుగ ఒక ప్రకృతి పండుగ! కాలాలను, రుతువులను అనుసరించి వస్తున్న మార్పులను, ప్రకృతి నియమాలను మనిషికి గుర్తు చేసే పండుగ! మారుతున్న, మారబోతున్న ప్రాకృతిక శీతోష్ణస్థితి, నైసర్గిక పరిస్థితులకు అనుగుణంగా మనిషి తనను తాను సన్నద్ధం చేసే ఒక పండుగగా బతుకమ్మ మనకు కనిపిస్తుంది. అందుకే బతుకమ్మ ఒక ప్రాకృతిక నివేదన! మానవాళి యావత్తు తన ఎదుగుదలకు కృషి చేస్తున్న ప్రకృతి మాతకి నీరాజనం అర్పించే పండగ బతుకమ్మ పండుగ!.



**5) మట్టి పండుగ (Festival of soil):** బతుకమ్మకి ముందు తొమ్మిది రోజులపాటు బొడ్డెమ్మ పండుగ చేయడం తెలంగాణ ప్రాంతంలో అనూచానంగా, సంప్రదాయంగా గ్రామీణ ప్రాంతాలలో జరుగుతూ వస్తోంది. నిజానికి బతుకమ్మ పండుగ అంటే కేవలం తొమ్మిది రోజుల పండుగ మాత్రమే కాదు అంతకు ముందు బొడ్డెమ్మ పేరుతో జరిగే తొమ్మిది రోజుల విశేషాలు కూడా బతుకమ్మ పండుగలో భాగమే. సాధారణంగా బతుకమ్మ పండుగ పెద్దలు, వివాహితులు, వివాహిత మహిళలు చేస్తే, పిల్లలు కూడా చేసే బొడ్డెమ్మ పండుగ యుక్తవయస్సుకు రాని అమ్మాయిలు, చిన్నారి బాలికలు అందరూ కలిసి వేడుకగా చేసుకునే పండుగగా ఉంది.

మానవ వయో దశలో బాల్యము, యవ్వనము, కౌమారము, వృద్ధాప్యము ఎలాగైతే ఉందో బతుకమ్మ పండుగకు సన్నాహక ఉత్సవం **(Prelude)** లాంటిది బొడ్డెమ్మ పండుగ. బాలికలు అందరూ ఉత్సాహంగా చేసుకునే పండుగ, కొత్త బట్టలతో తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో చేసుకునే పండుగ. దీంట్లో విశేషమేంటంటే గ్రామీణ ప్రాంతాలలో పల్లె జీవనంలో పుట్ట మన్ను ఉన్నచోట నుంచి, ఆ మన్ను తెచ్చి ఒక పీట లాంటి చెక్క నిర్మాణం పైన ఆ మట్టిని శిఖరంలా, పిరమిడ్ లాగా నీళ్లతో కలిపి నిర్మించి, వాటిలో అక్కడక్కడ పూలను గుచ్చి, దానికి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు.




GOVT. OF TELANGANA
TELANGANA SAHITYA AKADEMI

నేల మీద ఒక ముగ్గు వేసి ఆ ముగ్గులో ఈ పీట పైన పిరమిడ్ ఆకారంలో ఉన్న మట్టి బతుకమ్మని పెట్టి దాని చుట్టూ తిరుగుతూ అమ్మాయిలు, బాలికలంతా బొడ్డెమ్మ పాటలతో తమ ఇళ్ల ముందు గానీ, నలుగురు కలిసే కూడలి ముందుగానీ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అలా ఇక్కడ ప్రధాన పీఠంపై నిలుచున్నది బతుకమ్మ ఆకృతిలోని మట్టి. ఏ నేల నుంచి, ఏ మట్టి నుంచి తమ జీవన సారాన్ని మానవాళి స్వీకరించి ఈ మట్టిని పులుముకొని, తమ అస్తిత్వాన్ని నిలుపుకుందో, ఏ మట్టి పొరల్లోంచి వచ్చిన నీటిని తాగి చెట్లు, చేమలు, జీవనజాలం, కూరగాయలు, కాయగూరలు ఇవన్నీ ఎదిగాయో, వాటిపై ఆధారపడి తన జీవనాన్ని కొనసాగిస్తున్న మానవాళి ఉందో అలాంటి మట్టికి బాలికల ద్వారా వందనాలు తెలిపే పండగ ఈ బొడ్డెమ్మ పండుగ!.

అందుకే బతుకమ్మకు ముందు వచ్చే బొడ్డెమ్మ పండుగ మట్టి పండుగ.

**6) రుచుల పండుగ (Festival of Tastes):** బతుకమ్మ పండుగ నోరూరించే రుచులు పండుగ కూడా. బతుకమ్మ పండుగ ఉన్న తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ వివిధ రకాల వస్తు సామాగ్రితో, ఆహారధాన్యాలతో, వంటకాలు, రుచులు ఎన్నెన్నో చేసి సుష్టుగా భోంచేయడమే కాకుండా తమ ఇంటికి వచ్చిన అతిథులకు అందరికీ వాటిని పెట్టడం ద్వారా తమలోని ఆత్మీయతను వ్యక్తం చేయడం మన సంప్రదాయం. బతుకమ్మ పండుగకు పరాకాష్టగా నిలిచే సద్దుల బతుకమ్మ అంటే దుర్గాష్టమి రోజు ఊరు, వాడ అంతా చెరువుగట్టుకు వెళ్లి అక్కడ బతుకమ్మ ఆటపాటలతో ఆడి, పాడి, అలసి పోయి ఆ తర్వాత తాము ఇంటి నుంచి తెచ్చుకున్న సద్దులను తాము తింటూ ఇతరులకు పంచుతూ పిండి వంటలలోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఒకరికి ఒకరు తోడుగా నిలుస్తారు.

సద్దుల బతుకమ్మ పండుగ వివిధ రకాల తెలంగాణ వంటలు, కమ్మని రుచులను ఒకరి చేతి నుంచి మరొకరికి పంచుకునే ఒక వంటల ఉత్సవం. సద్దుల బతుకమ్మలో సద్దులుగా పల్లీల పొడి, నువ్వుల పొడి, కొబ్బరి పొడి, మొక్కజొన్నతో చేసే సత్తు పొడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటన్నింటిలో సాధారణంగా పంచదార, బెల్లం లాంటివి ఉన్నప్పటికీ తీపిగా మిగిలిపోవడం, తీపి వంటకాలుగా వుండడము ప్రధానాంశం అయినప్పటికీ ఇవి అన్ని ఆ కాలంలో మనిషిలో రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపకరిస్తాయని **Nutritionists** చెబుతారు. ఇవన్నీ వ్యాధులను ఎదుర్కొనే శక్తి కోసం కావలసిన ఉత్ప్రేరకాలను అందించగలిగే పోషక విలువలు ఉన్న వంటలు కావడం ఇక్కడ గమనించదగినది.

వర్షాకాలపు ప్రారంభంలో లేదా వర్షాకాలం మధ్యలో ప్రజలందరూ ఆరోగ్యపరంగా, శారీరకంగా, భౌతికంగా, తమని తాము సర్దుబాటు చేసుకుంటున్న తరుణంలో ఇలాంటి పిండివంటలను భుజించడం ద్వారా తమలో లోపంగా ఉన్న ఖనిజాలు, విటమిన్లు, పోషక విలువలు వంటి వాటిని భర్తీ చేసుకునే అవకాశం లభిస్తుంది. అందుకే బతుకమ్మ పండుగ "రుచుల పండుగ"!

**7) అనుబంధాల పండుగ (Festival of Relationships):** బతుకమ్మ పండుగ "అనుబంధాల పండుగ"! మానవసంబంధాల పండుగ! ఏ పండుగకైనా అంతిమ లక్ష్యం మానవ సంబంధాలను మెరుగు పరచడం, కుటుంబ సంబంధాలను బలోపేతం చేయడం, వాటిని పది కాలాల పాటు కొనసాగించడం, ఉత్సాహ పరచడమే అని చెప్పవచ్చు. ఆ లెక్కన బతుకమ్మ పండుగను మించిన గొప్ప "మానవ అనుబంధాల ప్రతిష్టాపన మహోత్సవం" ఇంకేమీ ఉండదు.

ఉద్యోగం, ఉపాధి, వివాహం, వలసలు, ఇతర కారణాల వల్ల రెక్కలొచ్చిన పిల్లలంతా తమ ఇల్లు, ఊరిని వదిలి వివిధ ప్రాంతాలకు ఎగిరి వెళ్లి పోయినా, బతుకమ్మ పండుగ వస్తుందంటే మళ్లీ తల్లిని వెతుక్కుంటూ, మూలాల్ని వెతుక్కుంటూ, ఊరిని వెతుక్కుంటూ తిరిగి వస్తారు. దీని కోసమని అన్నలు చెల్లెల్ని, బావని ఇంటికి ఆహ్వానిస్తారు. బంధువులందరూ పండుగ సందర్భంలో ఒక చోట కలవడం కుటుంబ అనుబంధాలని మరింత బలోపేతం చేసే కార్యాలుగా నిలుస్తాయి. కుటుంబ సభ్యులందరి ఆత్మీయతలు, అనురాగాలకి బతుకమ్మ ఒక మౌన ప్రేక్షకురాలుగా, సంధానకర్తగా ఉండడం మనకు కనిపిస్తుంది. బతుకమ్మలోని తీరొక్క పువ్వు లాగా కుటుంబములోని ఒక్కొక్క వ్యక్తి ఒక చోట ఒక పువ్వు లాగా ఉంటే వారందరినీ కలిపే దారం లాగా బతుకమ్మ పండుగ అందరిని పిలుస్తుంది, అందర్నీ ఆహ్వానిస్తుంది, అందరిని ఒకచోట గుదిగుచ్చి "జీవన బతుకమ్మ"ని మన కళ్లముందు సాక్షాత్కరింప జేస్తుంది.

**8) పాటల పండుగ (Festival of Songs):** బతుకమ్మ పండుగ పాటల పండుగ! బతుకమ్మ పండుగకి దాని విశిష్టతని, దాని గొప్పతనాన్ని, బతుకమ్మ పండుగ పుట్టుకని చెప్పే ఎన్నో జానపద కథలు, గాథలు, పాటలు వందలాది సంవత్సరాల నుంచి శృత సంగీతంగా, శృత సాహిత్యంగా ప్రజలందరిలో వాడుకలో ఉన్నాయి. లిఖిత సాహిత్యం అందరికీ



అందుబాటులో లేని సమయంలోనే మౌఖికంగా జానపద పాటల రూపంలో బతుకమ్మ పాటలు ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వసంపద లాగా కొనసాగుతూ వస్తున్నాయి. అలా ధర్మాంగుడు అనే రాజు కథ నుంచి మొదలుకొని అన్నా చెల్లెల్ల అనుబంధం, తల్లీబిడ్డల బంధాలని పౌరాణిక కథనాలతో సమకాలీన సామాజిక జీవన చిత్రాలతో చెప్పగలిగిన పాటలు బతుకమ్మ సందర్భంలో ప్రజలందరి నుంచి వినడం మనం చూస్తుంటాం. బతుకమ్మ పాటలు జీవన చిత్రాలుగా, రాగయుక్తంగా, లయబద్ధంగా, సాహితీ బద్దంగా, జానపద శైలిలో కొనసాగుతూ దేశీ సంప్రదాయపు మౌఖికతని మరొక్కసారి గుర్తు చేస్తాయి. అందుకే బతుకమ్మ ఒక చక్కని పాటల పండుగ.

ఇదే సందర్భంలో గ్రామంలో బతుకమ్మ పాటలు పాడే గాయనులకు ఎంతో గొప్ప కీర్తి, ప్రత్యేక గుర్తింపు కూడా కనిపిస్తుంది. ఒకరిని చూస్తూ ఒకరు బతుకమ్మ పాటలు నేర్చుకోవడం పంటల సమయంలో, ఏరువాక నాట్లు పంటకోత సమయంలో జానపద గీతాలతో పాటు, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహాన్ని, జీవనేచ్ఛను నింపుకోవడం మనకు కనిపిస్తుంది.

ఈ విధంగా ఎవరైతే చక్కని గొంతుతో చక్కని పాటను పాడగలవారు ఉంటారో అలాంటి మహిళలకి ఆ గ్రామంలో ప్రత్యేకత ఉండటం వారితో గొంతు కలుపుతూ మిగతా మహిళలందరూ బృందగానాలు చేయడం సాధారణంగా కనిపిస్తుంది. అలా తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఒక్కరూ తెలియకుండానే కళాకారుడిగా రూపొందడానికి కావలసిన పునాదులు, బీజాలు బతుకమ్మ పాటల నుంచే మొదలయ్యాయేమో అనిపిస్తుంది. అందుకే బతుకమ్మ ఒక పాటల పండుగ.

**9) సామాజిక పండుగ (Festival of All Section of Society):** బతుకమ్మ పండుగ సబ్బండ వర్ణాల సామాజిక పండుగ! ఒక గ్రామం అంటేనే దేశానికి సంక్షిప్త రూపం. దేశంలో ఎన్ని రకాల విశ్వాసాలు, నమ్మకాలు, సంప్రదాయాలు, రీతులు, వ్యక్తిత్వాలు, కుటుంబాలు, మనుషులు ఉంటారో, అంతే వైవిధ్యత, విభిన్నత, విశిష్టత కలిగిన మానవ సమూహాల సముదాయమే గ్రామంగా కనిపిస్తుంది. అలా ప్రతి గ్రామం ఆ గ్రామ స్వయం పోషకత్వం, వాటికి తగినట్టుగా వివిధ రకాల వృత్తులు, జాతులతో కూడిన మనుషులతో సంఘ జీవనాన్ని, పరస్పర ఆధారిత జీవనాన్ని గడుపుతూ వస్తుంది.

అయితే వివిధ వృత్తులు, కులాలు, వివిధ ప్రాంతాలలోని వివిధ వార్డుల్లోని, ప్రజలంతా సాధారణ సందర్భాలలో ఎలా ఉన్నప్పటికీ బతుకమ్మ పండుగ లాంటి సందర్భంలో మాత్రం అందరూ ఒక్కటై, అందరూ ఒకే దారిలో వెళుతూ, అన్ని దారులు చెరువువైపుగా వెళ్లడం అనే సంప్రదాయం మనకు కనిపిస్తుంది. అందుకే సబ్బండ వర్ణాల సామాజిక పండుగ బతుకమ్మ! రంగు, హెచ్చుతగ్గులు, వయోపరమైన వర్గ భేదాలు ఏవీ లేని ఒక సమానత్వం సమతతో కూడిన మానవత మనకు కనిపిస్తుంది.

**10) ప్రక్షాళనల పండుగ (Festival of cleaning):** బతుకమ్మ పండుగ ప్రక్షాళనల పండుగ! కొత్త నీరు వచ్చి, చెరువులన్నీ నీటితో జలకళతో కళకళలాడుతున్న సందర్భంలో నిలవ నీరు వివిధ రకాల వ్యాధులు, రోగాలకు ఆలవాలంగా నిలిచే అవకాశం ఉంటుంది. చెరువులు, సరస్సులలో నిల్వ ఉన్న నీటిని స్వీకరించిన కారణంగా చిన్నపిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న మానవులు, జంతువులు ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి కూడా కనిపిస్తుంది. అలాంటి నేపథ్యంలో, నీరు సంబంధిత వ్యాధులు (Water contaminated Diseases) ప్రబలి ప్రజలంతా సామూహికంగా అసువులు బాసిన సందర్భాలు మొదట్లో ఉండేవి. దానిని గమనించిన ఆనాటి మానవులు. వ్యాధుల నుంచి పరిహారం పొందాలంటే, రోగాల బారిన పడకుండా ఉండాలంటే నీటిని ప్రక్షాళన చేయాలనే సూత్రాన్ని గమనించారు. అందుకే ఏ గ్రామ ప్రజలు అయితే తాము తాగునీటి అవసరాల కోసం చెరువుల పైన ఆధారపడ్డారో ఆ చెరువులను శుద్ధి చేయాలని, ఆ చెరువు నీరును తాగే యోగ్యంగా మార్చాలని అనుకుని దాని కోసమని సంప్రదాయ ప్రకృతి సహజమైన విధానాలలో శుద్ధి **(Cleaning)** చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పూలలో దాగివుండే పుప్పొడిని, గౌరమ్మ పేరిట రూపొందించిన పసుపు ముద్ద ని సామూహికంగా ప్రజలందరూ పెద్దఎత్తున చెరువులో నిమజ్జనం చేయడం అనే ప్రక్రియ ద్వారా, చెరువులని ప్రక్షాళన చేయడం సాధ్యమైంది. అలా చెరువు నీరు సహజ విధానంలో శుద్ధి చేయబడి నీటి పరమైన వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించబడ్డాయి. అందుకే బతుకమ్మ పండుగ బతుకునిచ్చే పండుగ, బతుకును కొనసాగించే పండుగ, బతుకును పొడిగించే పండుగ.

**11) పర్యావరణ పండుగ (Festival of Environment):** మన చుట్టూ ఉండే పర్యావరణం వాటిని రక్షించాల్సిన ఆవశ్యకత మనకు ఉంది. మానవుడు నిత్యము పర్యావరణ అంశాల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. అనే సత్యాన్ని మరొక్కసారి గుర్తించేలా చేసేదే ఈ బతుకమ్మ పండుగ. అందుకే బతుకమ్మ పండుగ మనిషిని మనిషి చుట్టూ ఆవరించి ఉన్న పంచభూతాలని ప్రసన్నం చేసుకునే దిశగా మహిళలు చేసే నివేదనల కొలుపు! పర్యావరణాల మేలుకొలుపు!.

**12) ధన్యవాదాల పండుగ (Thanks giving Festival):** బతుకమ్మ పండుగ కృతజ్ఞతల పండుగ. మానవుడి ఎదుగుదలకి, మహిళల వికాసానికి సమాజం కుటుంబం ఎంతగా దోహదపడతాయో, అంతకన్నా మించి ప్రకృతి దోహదపడుతుంది. చెరువులు, చెట్లు, చేమలు, పంటలు, పొలాలు అన్నీ మానవ ప్రగతికి దోహదపడుతున్న సోపానాలు. మానవుడి అన్ని రకాల భౌతిక, శారీరక, మానసిక అవసరాలన్నింటినీ తీరుస్తున్న ప్రకృతి మాత వరాలు ఇవన్నీ. వీటికి మనిషి మహిళల ద్వారా, తమ ఇంటి ఆడబిడ్డ ద్వారా కృతజ్ఞతలు చెప్పే పండుగగా బతుకమ్మ పండుగను చెప్పవచ్చు.

ఈ విధంగా బతుకమ్మ పండుగ మానవ జీవితాన్ని పరివేష్టించి ఉన్నసమస్త అంశాలను స్పృశిస్తూ ఒక సంపూర్ణ ఉత్సవంగా **(Complete Festival)**, సమగ్ర పండుగగా **(Comprehensive)**, సమాహార వేడుకగా విలసిల్లుతూ వస్తోంది.

## బతుకమ్మ పాటలు:

బతుకమ్మ పండుగలో మరొక విశిష్టత, పాటలు, వాటిని పాడే విధానం! జానపదులు, గ్రామస్తులు పాడుకునే పాటలు తమ జీవన సరళికి అనుగుణంగా రూపొంది, వంశపారంపర్యంగా వందలాది సంవత్సరాల నుంచి ఒక తరం నుంచి మరొక తరానికి శ్రవణం ద్వారా మౌఖికంగా పరంపరలా కొనసాగుతున్న పాటలు ఎన్నో ఉన్నాయి. అలా బతుకమ్మ పాటలలో మనకు స్థూలంగా రెండు రకాలు కనిపిస్తాయి. 1) తెలంగాణాలోని అన్ని జిల్లాలు ప్రాంతాలలో పాడుకునే ప్రజాదరణ పొందిన పాటలు. 2) స్థానికంగా, ఆయా గ్రామాలు/జిల్లాలకు మాత్రమే పరిమితమై స్థానికతని **(local spirit)** నిబిడీకృతం చేసుకున్న పాటలు. వీటిలో భాష, పదాలు అన్నీ "ఉపమాండలికాలు' (Sub-dialects) కోవకు చెంది, ఆ స్థానిక ప్రాంతంలో తప్ప మరో చోట వాటి వాడుక అంతగా ఉండదు. లేదా వేరే పదాలతో వాడుకలో ఉంటాయి. అయితే ఇప్పటివరకూ బతుకమ్మ పండుగకు సంబంధించిన అన్ని పాటలని డాక్యుమెంట్ చేసే అవకాశం రాలేదు. అది ఊరూరా



తిరిగి సేకరించి రికార్డు చేయాల్సిన బృహత్ యత్నం అయితే ఇప్పటికే చాలా దొరికిన మేరకు గ్రంథస్థం చేసి భద్రపరిచే ప్రయత్నం జరిగింది. అయినప్పటికీ ఇంకా ప్రతి గ్రామంలోని ప్రజల నాల్కలమీద పాటలు, ఇప్పటికీ తెలియని ఎన్నెన్నో విభిన్నమైన పాటలు, వైవిధ్యభరితమైన పాటలు, బతుకమ్మ నేపథ్యంలోని పాటలు, ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిని రికార్డు చేయాల్సి ఉంది.

కాగా బతుకమ్మ పాటలలో, ఎన్నో జీవన సత్యాలు, మరెన్నో కుటుంబ అనుబంధాలు, సామాజిక సంబంధాలు, ప్రకృతి మానవుడికి మధ్య ఉండే అనుబంధ, బాంధవ్యాలు ఇలా ఎన్నో అంశాలు భౌతిక, అధ్యాత్మిక, సామాజిక, తాత్విక స్ఫూర్తితో మనకు దర్శనమిస్తాయి.

ఇలాంటి పాటల పరంపరను UNESCO వారు చెప్పినట్లు **Intangible** హెరిటేజ్‌గా భావించవచ్చు భవనాలు, నిర్మాణాలు, కట్టడాలు దేవాలయాలు ఇవి మనకు కనిపించే, మన స్పర్శించగలిగిన **Tangible** హెరిటేజ్‌గా భావిస్తే, మనకు కనిపించకుండా మన జీవితములో అంతర్భాగమై, మన జీవనశైలిలో కొనసాగుతూ, పరంపరగా మౌఖిక సంప్రదాయం రీత్యా వేలాది సంవత్సరాల నుంచి కొనసాగుతున్న వారసత్వ సంపదగా ఈ పాటలు, వీటిలో వెల్లడయ్యే జీవన సత్యాలు, ఈ పాటల్లో అంతర్భాగంగా ఉన్న తెలంగాణ జాతి జీవన శైలులు అన్నీ **"Intangible Heritage of Telangana"**గా భావించవచ్చు.

ప్రధానంగా బతుకమ్మ జానపదుల పండుగ కాబట్టి గతంలో పండితులు దాని చరిత్రను, వైభవాన్ని పరిశోధించే ప్రయత్నం పెద్దగా చేయలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో మాత్రమే ఆ దిశగా కొంత ప్రయత్నం జరిగింది. ఇంకా ఎంతో జరుగవలసి ఉంది. జన బాహుళ్యానికి బతుకమ్మ అనగానే గుర్తొచ్చేవి బతుకమ్మ పాటలు. ఇవి ఇప్పటికీ సింహబాగం స్త్రీల నోళ్ళలోనే ఉన్నాయి. ప్రత్యేకించి కొంత వయసు పైబడిన స్త్రీలకే పరంపరగా వస్తున్న పాటలు ఈనాటి బాలికలకు, యువతులకు పెద్దగా అలవడలేదు. అందుకు కారణాలుగా కనిపించే ఆధునిక పోకడలను అధిగమించి ఆనాటి నుంచి ఈనాటి వరకు ఇంకా మనుగడలో ఉన్న కొన్ని మంచి బతుకమ్మ పాటలనైనా మన ఆడ పిల్లలకు అందించాలనే లక్ష్యంతో భాషా సాంస్కృతిక శాఖ "బతుకమ్మ పాటలు" పేరుతో పుస్తకాన్ని ప్రచురించింది.

బతుకమ్మ పాటలు స్థానిక వైవిధ్యం కలవి. అన్ని ప్రాంతాల్లోనూ పాడే ప్రధానమైన బతుకమ్మ పాటలో 'బతుకమ్మ పుట్టింది ధర్మపురి ప్రాంతంలో' అని వినిపిస్తుంది. ఇలా పరంపరగా వస్తున్న నిక్కమైన నీలాలు ఈ బతుకమ్మ పాటలు. ఈ పాటల్లోనే బతుకమ్మను ఎలా పేర్చాలి మొదలుకొని, పాటలు ఎలా ఆడిపాడాలి అనే వరకు వివరాలున్నాయి. సంస్కృతీ సాంప్రదాయాలు, వారసత్వ విలువలున్నాయి. ధర్మపురి నరసింహస్వామితో పాటు తెలంగాణలోని ప్రసిద్ధ క్షేత్రాలైన వేములవాడ, కొమురవెల్లి, ఆడెల్లి, మంథని, మానేరు, జగిత్యాల వంటి స్థలాలతో పాటు శ్రీశైలం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాల వర్ణన కూడా కొన్ని పాటలలో కనిపిస్తుంది.

ఆ పాటలలోని అంశాలు, వస్తువును అనుసరించి వాటిని పరిశోధనా సౌలభ్యం కోసం ఈ క్రింది విభాగాలుగా వర్గీకరించవచ్చు:

1. బొడ్డెమ్మ పాటలు,
2. గౌరమ్మ పాటలు,
3. ఉయ్యాల పాటలు, ఈ తరహా పాటలలో వ్యక్తీకరించిన వస్తువు ఇతర అంశాల ఆధారంగా పరిశీలనా సౌకర్యం కోసం వీటిని మళ్ళీ నాలుగు రకాలుగా విభజించవచ్చు:

అ) బతుకమ్మను పూజించే పాటలు     ఆ) ఆడిబిడ్డల పాటలు

ఇ) దేవుళ్ళను పూజించే పాటలు     ఈ) గాథలను వినిపించే పాటలు.

ఇక చరిత్రలో బతుకమ్మ గురించి పరిశోధిస్తే బతుకమ్మ పండుగ ఎనిమిది వందల ఏండ్లకు ముందే తెలంగాణలో ప్రసిద్ధమైన పండుగ అని తెలిపే "వాడపల్లి శిలాశాసనం" వెలుగులోకి వచ్చింది. దీనిపై పూర్తి పరిశీలన వందేళ్ళ కిందటే ఆనాటి హైదరాబాద్ ఆర్కియాలజీకల్ సీరీస్‌లో ప్రచురితమైంది.

## తెలంగాణ ఉద్యమం - బతుకమ్మ

ఇక తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ పండుగకు ఒనగూడిన ఉద్యమిత్వ స్వభావం, రూపు కట్టిన విధానం ప్రస్తావించదగినది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో సాంస్కృతిక ప్రతీకలు, సాంస్కృతిక చైతన్య గీతికలు ప్రజలందరినీ ఏకం చేసే ఉత్సాహ కెరటాలుగా మారిన సందర్భంలో మన పండుగలు, గొప్పగా కీర్తించబడ్డాయి. ప్రజల చేత నీరాజనాలు పొందాయి. అలా 2000 సంవత్సరంలో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సందర్భంలో తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, తెలంగాణ తత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి బతుకమ్మ పండుగ సాంస్కృతిక గీతంగా, తెలంగాణ జాతి చైతన్య రూపంగా ఆవిష్కరించబడింది. మహిళలందరూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చే దిశగా బతుకమ్మ పండుగని ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్ళిన తర్వాత, గల్లీ నుంచి ఢిల్లీ వరకు, వీధుల నుంచి అపార్ట్‌మెంట్ల వరకు, ప్రతి చోట, తెలంగాణ నేల అంతటా, బతుకమ్మ పండుగ ఒక ఉద్యమ చేతనంగా ఉత్సవ కేతనంగా నిలిచింది.

## తెలంగాణ అవతరణ - బతుకమ్మ - సాంస్కృతిక శాఖ:-

తెలంగాణ రాష్ట్ర సాధనలో బతుకమ్మ పండుగ ఒక గొప్ప సాంస్కృతిక ప్రతిబింబంగా ప్రజల ఆత్మగౌరవ ప్రతిరూపంగా గెలిచింది, కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ ప్రభుత్వం బతుకమ్మ పండుగని రాష్ట్ర పండుగగా జీవో నెంబర్ 2, తేదీ: 24.07.2014 ద్వారా ప్రకటించడమే కాకుండా, బతుకమ్మ పండుగని నిర్వహించడానికి రాష్ట్రంలోనూ, దేశం మొత్తం మీద, అలాగే అంతర్జాతీయంగా తెలంగాణ జాతి ప్రజలు ఎక్కడెక్కడ అయితే నివాసం ఉంటున్నారో వారందరినీ ఒకటి చేస్తూ బతుకమ్మ పండుగ నిర్వహించడానికి వీలుగా నిధులను కేటాయిస్తూ, ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నారు. పూల పండుగగా బతుకమ్మని, ప్రాకృతిక నివేదనగా బతుకమ్మని, ప్రపంచానికి చాటి చెబుతూ తెలంగాణ సాంస్కృతిక విశిష్టతను ఎలుగెత్తి చాటేలా చేస్తున్నారు.

ఆ క్రమంలో భాషా సాంస్కృతిక శాఖ 2014 నుంచి అత్యంత వైభవంగా ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగని మరింత విస్తృతస్థాయిలో నిర్వహిస్తూ, ఇప్పుడు బతుకమ్మ తెలంగాణకు "అస్మిత రూపం" అనే స్థితికి వచ్చింది. ఒకప్పుడు కేవలం పల్లెలకు, గ్రామాలకు, జానపదులకు పరిమితమైన బతుకమ్మ పండుగ ఇప్పుడు ఒక సార్వజనీన ఉత్సవం (Universal Festival)గా, కుల, మత, ప్రాంతీయ, వర్గ, భాషా భేదాలకు అతీతంగా ఒక విశ్వజనీన దృక్పథాన్ని (Cosmopolitan outlook) సంతరించుకున్నది.

"A Festival may vary and differ from other festival, as every festival is special, unique and novel with each other in their ritual, practice, belief system, style of performance etc. But the main aim of any festival is to establish healthy and happy social environment within the frame work of a natural environment. That's why, all the festivals celebrated across the globe will have a latent intention of ecological balance and sustainable development on one hand, and regulation and order of human life on the other" అన్న మాటలు బతుకమ్మ పండుగలోని తీరును గమనిస్తే అక్షర సత్యాలుగా గోచరిస్తాయి.

ఇంతటి విశిష్టత ఉన్న బతుకమ్మ పండుగకు అంతర్జాతీయ ఖ్యాతిని గడించే దిశగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఎన్నో ప్రయత్నాలు చేయడం జరిగింది. వాటిలో భాగంగా 10 వేల మంది మహిళలతో, లాల్ బహదూర్ స్టేడియంలో 8 అక్టోబర్, 2016 సంవత్సరంలో మహా బతుకమ్మ ప్రదర్శనని నిర్వహించడం జరిగింది. అలాగే ఆ తర్వాతి సంవత్సరం 22 సెప్టెంబర్, 2017న తంగేడు పువ్వు ఆకృతిలో మహిళలను నిలిపే విధంగా **(Largest human formation in the form of Thangedu Flower)** లాల్ బహదూర్ స్టేడియంలో ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ఇవి ప్రపంచ స్థాయిలో గిన్నిస్ రికార్డుని సాధించడానికి చేసిన ప్రయత్నాలు.

బతుకమ్మ పండుగను ప్రస్తుతం నిర్వహిస్తున్న సూరత్, భీవండి, బొంబాయి, బెంగుళూరులోనే కాకుండా చెన్నై, కోల్ కత్తా, గౌహతి, తంజావూరు, దేశ రాజధాని నగరం ఢిల్లీలో కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే అంతర్జాతీయంగా



40 పైగా దేశాలలో బతుకమ్మ పండుగను ఇప్పుడు తెలంగాణ జాతి బిడ్డలు నిర్వహిస్తూ, బతుకమ్మకి ఒక విశ్వజనీన లక్షణాన్ని తీసుకొచ్చారు. ఇలాంటి బతుకమ్మ పండుగ ఇప్పుడు తెలంగాణ జాతి హృదయ స్పందనగా మారింది. ప్రపంచ ప్రజలందరికీ ప్రాకృతిక నివేదనగా ఒక విశిష్ట స్థానాన్ని సాధించుకున్నది.

## భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలు - బతుకమ్మ

బతుకమ్మ పండుగను ఒక సామాజిక, ఆర్థిక, చారిత్రక, సాంప్రదాయక, ఆధ్యాత్మిక, పర్యావరణ పరమైన, సంగీతనాట్యపరమైన అంశాలన్నింటిని మేలు కలయికగా అర్థం చేసుకోవచ్చు. వీటన్నిటినీ ఒక్కచోట గుదిగుచ్చి సమర్పించాలనేది తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సంకల్పం! ఆ దిశగా బతుకమ్మలోని బహుముఖాలను ఆవిష్కరించడానికి 'అక్షరయాన్' మహిళా రచయిత్రుల వేదిక సహకారంతో "ఒక్కొక్క పువ్వేసి సందమామ" పేరుతో 2024లో సమగ్ర వ్యాససంపుటిని పుస్తకంగా ప్రచురించడం జరిగింది.

తెలంగాణ అంటేనే పండుగల నేల!
ఉత్సవాల హేల!
సామూహిక జన జాతరల మేళా!

వేలాది సంవత్సరాల క్రితం ఈ నేలపై పుట్టి, ఈ మట్టి నుంచి ఎదిగి, ఈ మనుషులతో పాటు సహజీవనం చేస్తూ ఎప్పటికప్పుడు తన లక్ష్యాన్ని, గమ్యాన్ని, గమనాన్ని మార్చుకుంటూ ఆత్మని కోల్పోకుండా ఆధ్యాత్మిక స్ఫూర్తిని విస్మరించకుండా తెలంగాణ ప్రజలందరినీ, ఆడబిడ్డలందరినీ ఒక్కతాటిపై నిలుపుతున్న మహోన్నత ఉత్సవం బతుకమ్మ పండుగ. అలాంటి శిఖరాయమానమైన పండుగకి తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ అందిస్తున్న అక్షర నీరాజనం ఈ పుస్తకం.

**డా. మామిడి హరికృష్ణ**
సంచాలకులు
భాషా సాంస్కృతిక శాఖ